ప్రజాశక్తి
గురువారం 2 మే 2024
I
అల్లూరి సీతారామరాజు



52 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని అన్నవరం సమీపం లో 52 కేజీల లిక్విడ్ గంజాయిను స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చింతపల్లి ఏఎస్పి ప్రశాంత్ శివ కిషోర్ తెలిపారు.బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ, ఒడిశా సరిహద్దులో తయారై రవాణాకు సిద్ధంగా ఉన్న లిక్విడ్ గంజాయిని, పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ సుమారు 5.5 కోట్లు ఉంటుందన్నారు. ఈ కేసులో శ్రమించిన చింతపల్లి సీఐ రమేష్‌ను, అన్నవరం ఎస్సైను, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేశారు.



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

మేడే స్ఫూర్తితో పోరాటాలు

- ఘనంగా కార్మిక దినోత్సవం
-పలుచోట్ల జెండాలను ఎగురవేసిన నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రంలో వివిధ రంగాల కార్మికులు బుధవారం కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా కార్మిక వర్గాలు మే డే సందర్భంగా పతాకావిష్కరణలు నిర్వహించారు. కార్మిక వాడల్లో ఎర్రజెండా రెపరెపలాడింది పాడేరు జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలుచోట్ల జిసిసి వర్కర్స్, ముఠా, పంచాయతీ కార్మికులు, కాఫీ కార్మికులు, అంగన్వాడీ, హాస్పిటల్ వర్కర్స్ తమ తమ ప్రాంగణాల్లో పతాకావిష్కరణ నిర్వహించారు. కళాసి వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు దేవుడుబాబు జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినం సాధించుకున్న రోజు మే డే అని, ఈ స్ఫూర్తితో కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలుకై పోరాడాలన్నారు కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా కదలాలని



పాడేరులో జెండాను ఎగురవేస్తున్న కోటేశ్వరరావు

పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాడేరు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు, నాయకులు గౌరీ నాయుడు, దేముడు, అప్పారావు, అర్జున్, బొజ్జన్న, రాజు, సూరిబాబు, ముత్యాలమ్మ, పుణ్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు, అంబికా, కుమారి,కార్మికులు , తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:మండల కేంద్రంలో నాలుగు రోడ్డు కూడలి వద్ద సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి జన్ని భగత్ రామ్ ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్, కె.రామారావు, కళాకారుల సంఘం నాయకులు జోషి, బుచ్చిబాబు, మగ్గన్న, పి కొండలరావు, బాబురావు, జిసిసి సోప్ యూనిట్ కార్మికులు సింహాద్రి, అంగన్వాడి నాయకులు వెంకటలక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో జెండాను ఎగురవేస్తున్న ఉమామహేశ్వరరావు

చింతూరు:మండలంలోని ఎర్రంపేట సెంటర్లో జీసీసీ హమాలీల యూనియన్ (సిఐటియు) నాయకుడు నాగార్జున సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ కార్మిక, కర్షకులంతా ఏకమై పదేళ్లగా కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్న మతతత్వ బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మేడే పోరాటస్ఫూర్తితో పెట్టుబడిదారుల పాలకవర్గాల దోపిడీలు, అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు పెద్దరాములు, సిహెచ్.సుబ్బారావు. జిసిసి హామాలీలు పాల్గొన్నారు.



చింతూరులో జెండాను ఎగురవేస్తున్న సిఐటియు నేతలు

డుంబ్రిగుడలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ కార్యాలయ భవనంలో ప్లాస్టిక్ వ్యర్థలు సేకరించే ఓ వ్యక్తి బుధవారం హత్యకు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు అరకు సీఐ రుద్రశేఖర్ , స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ సంఘటన స్థలంలో చేరుకుని పరిశీలించారు. మృతుడు ఎస్ కోట మండలం రాజిపేట గ్రామానికి చెందిన బత్తిన శివ శ్రీనివాస్ గా గుర్తించారు. మృతుడు ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తుంటారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. హత్యకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ



పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్న గిరిజనులు

తాటిముంజెలు, పుచ్చకాయలకు గిరాకీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రస్తుతం సూర్య భానుడి ప్రతాపానికి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత నుంచి దాహార్తి, సేద తీర్చుకోవడానికి పానీయాలను, పుచ్చకాయలు, తాటి ముంజలను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. బుధవారం మండలంలోని కించమండలో జరిగిన వారపు సంతలో తాటి ముంజులు, పుచ్చకాయలను గిరిజనులు కొనుగోలు చేయడంతో అవి హాట్ కేకుల అమ్ముడు పోయాయి. ఎండల తీవ్రత కారణంగా తాటి ముంజులు, పుచ్చకాయలకు బాగా గిరాకీ ఏర్పడింది. వీటిని ఎస్.కోట, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం నుంచి తీసుకొచ్చి విక్రయిస్తుండటంతో గిరిజనులు ఎగబడి కొంటున్నారు. వ్యాపారం బాగా జరుగు తుండడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తాటిముంజెలను విక్రయిస్తున్న వ్యాపారి

ఇవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి : పిఒ



అధికారులతో మాట్లాడుతున్న పిఓ

ప్రజాశక్తి-అరకులోయ:అరకు అసెంబ్లీ నియోజక వర్గంలో ఈవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ తెలిపారు. బుధవారం అరకులోయ తహశీల్దార్ కార్యాలయంలో జనరల్ పరిశీలకులు కె.వివేకానందన్, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశాల మేరకు ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు.ఈనెల 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల బరిలో 17 మంది అభ్యర్థులు నిలిచారు. ~~అరకు నియోజక వర్గం పరిధిలోని 304~~ పోలింగ్ కేంద్రాలకు అసెంబ్లీ అభ్యర్థులకు ఒక బ్యాలెట్ యూనిట్, ఎంపి అభ్యర్థులకు ఒక బ్యాలెట్ యూనిట్ అవసరం ఉంటుందని భావించారు. కాని అనూహ్యంగా 17 మంది నిలవబడటంతో మరో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు అవసరం ఉండటంతో అదనంగా బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సమకూర్చడం జరిగింది. ఎన్నికల పరిశీలకులు కె.వివేకానందన్ స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈవిఎంల పంపిణీకి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారులు సుధాకర్, సోమేశ్వరరావు, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచం గిపుట్టు తాహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన హత్య కేసు నిందితుడు

ప్రజాశక్తి-పెదబయలు :సీతగుంట పంచాయతీ పెదబయలు మాజీ సర్పంచ్ ఇంట్లో గత శనివారం రాత్రి వర్తనపల్లి గ్రామానికి చెందిన శోభ హేమరాజు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడు పల్లుల సుందర్‌రావు (అప్పారావు) నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సిఐ విచారణ చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించారు.



నిందితుడితో పోలీసులు

పోలవరం నిర్వాసితులు, ఏజెన్సీ ప్రాంత సమస్యలపై

పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

- ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
- చింతూరులో భారీ రోడ్డు షో
- సిపిఎంతోనే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ : లోకనాథం



చింతూరులో నిర్వహించిన సిపిఎం రోడ్డు షోకు భారీగా హాజరైన జనం

ప్రజాశక్తి -చింతూరు

పోలవరం ముంపు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. కాంగ్రెస్, సిపిఐ, ఆమ్‌ఆద్మీ పార్టీలు (ఇండియా వేదిక) బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స పాచిపెంటలను గెలిపించాలని కోరుతూ చింతూరులో బుధవారం భారీ రోడ్ షో నిర్వహించారు. ఎర్రంపేట గ్రామం నుండి ప్రారంభమైన రోడ్ షోలో మంతెన సీతారాం, సిపిఎం అభ్యర్థి లోతా రామారావు, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి హబీబ్ తదితరులు ప్రచార వాహనంపై అభివాదం చేస్తుండగా, ఎర్రజెండాలతో, ప్రజానాట్యమండలి డప్పు వాయిద్యాలతో భారీ జనసమూహంతో పోలీస్ స్టేషన్, అంబేద్కర్, ఇందిరా సెంటర్ల మీదుగా చింతూరు లారీ యూనియన్ ఆఫీస్ వరకు ఈ రోడ్ షో సాగింది.

అనంతరం మంతెన సీతారాం మాట్లాడుతూ టిడిపి, జనసేన బిజెపి కూటమి మేనిఫెస్టోలో ప్రజలకు ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతానికి చేసింది ఏమీ లేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కోసం ఒక్కపైసా కూడా నిధులు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు తానేమి చేయలేనని వారి ముందే తేల్చి చెప్పిన జగన్మోహన్ రెడ్డికి ఏ విధంగా మళ్లీ ఈ ప్రాంత వాసులు ఓట్లు వేసి గెలిపిస్తారని ప్రశ్నించారు. నిస్వార్థంగా, నిజాయితీగా ఎర్రజెండా నీడలో సిపిఎం మాజీ ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, కుంజా బొజ్జి అందించిన సేవలు మరువలేనివని, అటువంటి యోధులు పోరాటాలు చేసిన గడ్డపై వైసిపి, టిడిపి ప్రభుత్వాల పాలనలో నేడు అవినీతి రాజ్యమేలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండ రవికుమార్ మాట్లాడుతూ పోరాట పటిమ, ఉద్యమ స్ఫూర్తి కలగలిసిన లోతా రామారావును గెలిపించాలని కోరారు. మత, కులతత్వ రాజకీయాల ద్వారా లబ్ధి పొందే కూటమి నాయకుల మాటలు విని మోసపోవద్దని హితవుపలికారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి హబీబ్ మాట్లాడుతూ అందరం కలిసి మతతత్వ బిజెపి, దాని కూటమిని ఓడించాలని, లేకుంటే దేశం అధోగతి పాలవటం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, లక్ష్మణ్, ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, పెద్ద రాములు, దేవుడు, మొత్తం రాజయ్య, పాండ్రం సుబ్బారావు, కారం సుబ్బారావు, మడకం చిన్నయ్య, కలుముల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు అలీ అక్బర్, నరేష్ టైలర్, బొక్కిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారం

వై.రామవరం : మండలంలోని పాతకోట పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలోనూ, వారపు సంతలోనూ సిపిఎం నాయకులు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకుల చెల్లా రామకృష్ణ, నాగమణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలపై చట్టసభల్లో గళం వినిపించాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, నాయకులు తోడం రాజు, జి లక్ష్మణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : సిపిఐ

ఎటపాక : సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము పిలుపునిచ్చారు. మండలంలోని గన్నవరంలో జరిగిన సిపిఐ, సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ ఎంపిటీసీ కంటే రాజు, సిపిఐ మండల కార్యదర్శి ఎలిసాల నాగరాజు, వీరబ్రహ్మం, సత్యనారాయణ, సిపిఎం నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, అపకా సమ్మక్క, సూరమ్మ పాల్గొన్నారు.



విఆర్.పురంలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు

ఇండియా వేదిక నాయకుల సమావేశం

విఆర్.పురం : కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకుల సమావేశం రేఖపల్లిలో బుధవారం జరిగింది. ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి అహర్నిశలు కృషి చేయాలని ఆయా పార్టీల కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేదిక నాయకులు పూనం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు, లీలాకృష్ణ, కర్నాటి ఏసుబాబు, శివగిరి కామేశ్వరరావు, కడుపు క్రాంతి, కుంజ రమేష్, పూనం ప్రదీప్ కుమార్, వాళ్ల కృష్ణారెడ్డి, జి లక్ష్మణరావు, తాతబాబు, ముసలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎంతోనే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ

అనంతగిరి : హక్కులు, చట్టాల పరిరక్షణకై సిపిఎం అరుకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి ధీసరి గంగరాజు విజ్ఞప్తి చేశారు. మండలంలోని డముకు, కాశీపట్నం వారపు సంతల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మిక, కర్షక, గిరిజన ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఏకైక పార్టీ సిపిఎం అని తెలిపారు. వైసీపీ, బీజేపీ, టిడిపి అభ్యర్థులను ఓడించాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, సిపిఎం సర్పంచ్ మొస్య, వేంగడా మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, కార్యకర్తలు బుద్రయ్య, పొట్టన్న, తదితరులు పాల్గొన్నారు

సంతలో ప్రచారం

డుంబ్రిగుడ : ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స బుధవారం మండలంలోని కించమండ వారపు సంతలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీ అభ్యర్థి సంతలోని ప్రతి దుకాణదారులకు కరపత్రాలను పంచుతూ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



కరపత్రం ఇచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, రాష్ట్ర నాయకులు సురేంద్ర తదితరులు

అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.సురేంద్ర మాట్లాడుతూ గిరిజనులకు పోడు పట్టాలు, రేషన్ కార్డులు, వారపు సంతల్లో జరుగుతున్న తూకల్లో మోసాలు, మధ్యవర్తుల దళారుల బెడద, ఇతర సమస్యలపై సిపిఎం పోరాడుతుందని చెప్పారు. వీటిని గిరిజనులు గమనించి ప్రజల పక్షం పనిచేస్తున్న సిపిఎం ఎంపీ అభ్యర్థికి, ఇండియా ఫోరం ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ పి.శాంతకుమారి, ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, నాయకులు పి డుంబు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండలంలోని గసభ పంచాయతీ కుసుమకేంద గ్రామంలో సిపిఎం మండల నాయకుడు, మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అరకు పార్లమెంట్ సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని ఉపాధి హామీ కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిలో.సురేంద్ర ప్రచారం చేపట్టారు. జబడ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గాసిరం దొర, జర్రెల ఉపసర్పంచ్ గణపతి, లైకోన్, లక్ష్మీపురం వార్డు సభ్యులు ఎస్ సోదా పాల్గొన్నారు,

హుకుంపేట : ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలి 350 రూపాయలు ఇవ్వాలని అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స డిమాండ్ చేశారు. మండలంలో మెరక చింత, గన్నేరు పుట్టు గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో పలు సమస్యలను అప్పలనర్స దృష్టికి రైతులు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.కొండలరావు, సిపిఎం జిల్లా నాయకురాలు ఎస్.హైమావతి, నాయకులు కృష్ణారావు, లక్ష్మణరావు, కృష్ణమూర్తి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



వారపు సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు లోకనాథం, జెడ్పిటిసి ధీసరి గంగరాజు

కూటమి నేతల ప్రచారం



ప్రచారం చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి - చింతపల్లి : కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంపివి ప్రసాద్ అన్నారు. బుధవారం చింతపల్లి వచ్చిన ఆయన తెదేపా, జనసేన, బిజెపి నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో అభివృద్ధి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్బాయి నాయుడు, కేవీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోనంగి బాలయ్య పడాల్, కదుల్ శ్రీనివాసరావు, గొర్లె సోమేశ్, జనసేన మండల అధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

వైసిపి నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రజలు సంక్షేమాన్ని అందుకుని సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ వైసిపిని గెలిపించాలని ఎంపిపి కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనుజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని కణమాం, భీమన్న దొరపాలెం కోలవానిపాలెం పంచాయతీల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక వైసిపి నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జగన్మోహనరెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయడం ద్వారా సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, రామకృష్ణ, పినిశెట్టి సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డులో టిడిపి నాయకులు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు, సంఘాల ప్రతినిధులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం ఆరిలోవ కాలనీ, వెన్నెలపాలెంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. ప్రసంగి వాసు ఆధ్వర్యంలో 150 మంది, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ సభ్యురాలు సువ్వాడ శ్రీదేవి, వెల్లుర్లనగర్, విష్ణుపురి కాలనీ, పైనాపిల్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం, దుర్గానగర్ ప్రాంతాల నాయకులు పార్టీలో చేరారు. కూటమి తరపున పోటీలో ఉన్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి, ఎంపి అభ్యర్థి శ్రీభరత్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతకంద ధర్మారావు, మజ్జి రమణి, నల్లాని వరలక్ష్మి, తురకపూడి బాలస్వామి, యల్లమిల్లి సురేష్ పాల్గొన్నారు.

12వ వార్డులో టిడిపి ప్రచారం

12వ వార్డులో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు ఎంపి అభ్యర్థి శ్రీభరత్ సోదరుడు శ్రీసిద్ధార్థ, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో న్యూఆంటెనినగర్, గణబాబు నగర్, బిటిఆర్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, ముగద రాజారావు, నమ్మి గణేష్, సీరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన కార్మిక చైతన్యం

వాడవాడలా మేడే వేడుకలు.. అడుగడుగునా అరుణ పతాకావిష్కరణలు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కార్మికశక్తిని, చైతన్యాన్ని చాటిచెబుతూ మేడే పతకాన్ని ఆవిష్కరించారు. హక్కుల సాధనకు పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

చింతపల్లి: మే డే సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్‌లో సిఐటియు పతాకాన్ని ఆశా వర్కర్ల యూనియన్ రాజేశ్వరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చిన్నయ్య పడాల్, ధనుంజయ్, చిరంజీవి, రాంబాబు, సింహాచలం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద సిఐటియు కార్యదర్శి కుర్ర శంకర్రావు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ, శ్రమ దోపిడీపై కార్మికులు అన్ని దేశాల్లో అప్పట్లో పోరాటాలు మొదలు పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల యూనియన్ ఎస్.శారదా దేవి, డి.సుజాత, పి.సత్యవతి, జి.కుమారి, వి.రత్నాలమ్మ, ఎస్.పార్వతి, ఎస్.సూరమ్మ, పి.కళ్యాణి పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని అరకు వారసంతలో సిఐటియు నాయకుడు టి.సూర్యనారాయణ కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కే.కొండమ్మ, కే.సత్యవతి, పవిత్ర, కార్మికులు పాల్గొన్నారు.

పెదబయలు : మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ కూడలి నుండి అంబేద్కర్ నాలురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. జెండాను సిఐటియు మండల అధ్యక్షురాలు టి.రాజమ్మ, ఆవిష్కరించారు. సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, కార్మికులకు ఎనిమిది గంటల పని దినాలు కల్పించాలని ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారన్నారు. సిఐటియు మండల అధ్యక్షురాలు టి రాజమ్మ, చెండా రామారావు, గిరిజన సంఘం నాయకులు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అనంతగిరి: స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఘనంగా మే డేను నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శుల సిహెచ్ కళావతి, పి.మంజులు పతాకాన్ని ఆవిష్కరించారు. సిఐటియు మండల కార్యదర్శి కె.మోసియా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పుడిగి దేముడు పాల్గొన్నారు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ కడప వలసలో మల్లమ్మ తల్లి (మల్య శాల) జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు టి సూర్యనారాయణ, బి.మోహన్‌రావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మిక కర్షకులారా ఏకమవుదాం, మతోన్మాద బిజెపి ని ఓడిద్దాం.

రాజవొమ్మంగి : మండల కేంద్రంలోని తాపీ మేస్త్రీల సంఘం భవనం వద్ద అధ్యక్షుడు వీరబాబు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మెయిన్ రోడ్ ఆర్ అండ్ బి అతిథి గృహం సమీపంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకుల చేతుల మీదుగా సిఐటియు జెండాలను ఎగురవేశారు. సిఐటియు కాకినాడ అధ్యక్షుడు పలివెల వీరబాబు మేడే విశిష్టతను వివరించారు. సిఐటియు మండల కన్వీనర్ పి రామరాజు అధ్యక్షతన కార్యక్రమంలో చికిలింత సర్పంచ్ కోండ్ల సూరిబాబు, సిఐటియు అనుబంధ సంఘాల నేతలు ఎన్ అచ్చారావు, ఎస్ నాగు, చిన్ని రాంబాబు, నాగు, భద్రం, కె వెంకటలక్ష్మి, ఎం రమేష్, టి.శ్రీను, ఎన్ రామకృష్ణ పాల్గొన్నారు.

వై.రామవరం : మండలం కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్ నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సిఐటియు జెండాను సంఘం మండల అధ్యక్షులు కె.బుల్లెమ్మ ఎగురవేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు జి.రామకృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శాంతిరాజు, దుర్గా, అమ్మాజీ, జోగమ్మ, రామలక్ష్మి, వీరలక్ష్మి, శ్యామల, తులసి, మల్లికార్జునరావు, జె.రాజు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేటలో సిఐటియు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.రామకృష్ణ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సవరించి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను యజమానులకు కట్టుబానిసలను చేసిందని విమర్శించారు. బీజేపీ మతోన్మాద విధానాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకట్రావు, సిఐటియు నాయకులు పోచమ్మ, కట్టుమూరు వీరబాబ, రాధ, లక్ష్మి, చిట్టెమ్మ, శ్యామల రాణి, చంద్రు బుల్లెమ్మ, వి. సాయిబాబు, ఎస్.సాయికృష్ణ, రాజా బేబీ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని మార్త శ్రీరామ్మూర్తి భవన్లో ఎర్ర జెండాను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆఫీసు వద్ద మే డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, సిపిఎం నాయకులు చింత రాంబాబు, సిపిఎం వార్డ్ మెంబర్ పెరుమాళ్ళ దేవుడు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ (సిఐటియు) యూనియన్ కార్యాలయం వద్ద ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏపీ జెన్కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు బి.లక్ష్మణ్, విష్ణు కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులంత ఐక్యంగా హక్కుల గురించి పోరాడినప్పుడే విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్కె.సుభాన్, పిల్ల రమణ, గంగిరి రమణ పాల్గొన్నారు. సీలేరు ఐఎన్‌టియుసి కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. సంఘ నాయకులు వై దాద్రాజు, కార్మికులు పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో...




చింతపల్లిలో...



ముంచంగిపుట్టులో...



దేవీపట్నంలో...



సీలేరులో..



వై.రామవరంలో...



కూనవరంలో...



ఇవిఎంలను పరిశీలిస్తున్న నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి-రంపచోడవరం

సార్వత్రిక ఎన్నికలకు రెండవ లెవెల్ ర్యాండమినేషన్ వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం నిర్వహించినట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈవీఎంలు, వివి ప్యాడ్లులను ఓపెన్ చేసి పరిశీలించారు. ముందుగా ఎన్నికల పరిశీలకులు కె.వివేక్ నందన్, జిల్లా ఎన్నికల అధికారి యం.విజయ సునీత ర్యాండమిషన్ ప్రక్రియ ఏ విధంగా నిర్వహించుచున్నది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీకి వేరువేరుగా 518 ఈవీఎంలు, 518 వివి పాడ్లకు స్ట్రాంగ్ రూములో 24/7 భద్రత సీసీటీవీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఎవరికైనా ఈ ర్యాండమినేషన్‌పై అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.కృష్ణజ్యోతి, ఇన్స్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన బాలకృష్ణ, మఠం విజయ భాస్కర్, దుమంతు విశ్వనాథం, యం.అంజిరెడ్డి, కె.కన్నం రెడ్డి, డి.విశ్వనాథం, పి.అనంత మోహన్, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, రామకృష్ణ, సుబ్బారావు, శివ, శ్రీధర్, బాలాజీ, చైతన్య, విశ్వనాథ్, రవీంద్రబాబు, సత్యనారాయణ, సరిత, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సిఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయంలో మారుపూజ

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం మారెమ్మ అమ్మవారి ఆలయంలో మార పూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయంలో భక్తులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మారమ్మ అమ్మవారికి కానుకలుగా వచ్చిన చీరలకు ఆలయ కమిటీ వేలాంపాట నిర్వహించింది. వేలంపాటలో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. బుధవారం మారు పూజతో మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో సిఐ అశోక్ కుమార్, సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

మాటల యుద్ధం తప్ప అభివృద్ధి ఊసే లేదు

పాయకరావుపేట సభల్లో చంద్రబాబు, జగన్‌లది ఒకటే తంతు



పాయకరావుపేట సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో మూతపడ్డ సహకార సుగర్ ఫ్యాక్టరీలకు వైసిపి, టిడిపి ప్రభుత్వాల్లో మోక్షం లభించేలా లేదు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామన్న మాట ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డిల నోట రావడం లేదు. జిల్లాలోని పాయకరావుపేటలో ఆ ఇద్దరూ కొద్ది రోజుల వ్యవధిలో బహిరంగ సభలు నిర్వహించారు. సరిగ్గా పక్షం రోజుల కిందట వచ్చిన చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కడా జిల్లా అభివృద్ధికి తాను ఏం చేస్తానన్న విషయం చెప్పలేదు. బుధవారం మేమంతా సిద్ధం సభకు వచ్చిన జగన్‌దీ అంతే తంతు. ఏ ప్రభుత్వం వచ్చినా ఫ్యాక్టరీల ఆస్తులు అమ్మి సొమ్ము చేసుకునేలా వాతావరణం ఉంది. ఇప్పటి వరకూ చేసిన పొరపాటును గుర్తించి చెరుకు రైతులు, కార్మికులకు జరిగిన నష్టాన్ని తెలుసుకొని వైసిపి, టిడిపి సరిదిద్దుతాయన్న ఆశ ఏ మూలా రైతుల్లో కనిపించడం లేదు. అధికారంలోకి రావడం కోసం భ్రమలు పెట్టడం తప్ప జిల్లాలోని ప్రధానమైన స్థానిక సమస్యలపై అటు జగన్, ఇటు బాబు ఎవ్వరూ మాట్లాడ్డం లేదు. బుధవారం నాటి పాయకరావుపేట సభలో సుగర్ ఫ్యాక్టరీల విషయంపై జగన్ హామీ ఇస్తారని అంతా అనుకున్నా వాటి ప్రస్తావన రాలేదు. తీర ప్రాంత మత్స్యకారుల ఉపాధి సమస్యపైనా ఏ హామీ ఇవ్వలేదు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాల కల్పనపై గ్యారంటీ ఇవ్వలేదు. ఎంతసేపూ పథకాలు గురించి చెప్పడం, విమర్శలు చేయడం మినహా ప్రధాన పార్టీలు రెండూ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టిడిపి చేస్తున్న దుష్ప్రచారంపై జగన్ పాయకరావుపేట సభలో వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. జగన్ భూములు ఇచ్చేవాడేగానీ భూములు లాక్కునేవాడు కాదని అన్నారు.

భిన్నంగా ఇండియా బ్లాక్ ప్రచారం

ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలంటూ ఇటీవల పాయకరావుపేటకు ప్రచారానికి వచ్చిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల మాత్రం తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. జిల్లాలోని సమస్యలను ఆమె ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో నష్టపోతున్న చెరుకు రైతుల గురించి ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి మద్దతునిస్తున్న టిడిపి, వైసిపిలను తరిమికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ గెలిస్తే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పాటుపడతాయన్నారు.



పాయకరావుపేట సభలో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు (ఫైల్‌ఫొటో)

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి -మునగపాక

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాత, మార్క్సిస్ట్ యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి కార్యక్రమంలో మండలంలోని తోటాడ సుందరయ్య గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ విలువలతో కూడిన నాయకుడిగా తన జీవితాన్ని త్యాగం చేసి ఎర్రజెండాను నిలబెట్టిన ఘనత సుందరయ్యకే దక్కుతుందని చెప్పారు. సుందరయ్య లాంటి మహోన్నత వ్యక్తుల ద్వారా నేటి యువత స్ఫూర్తి పొందాలన్నారు. దేశంలో నేటి రాజకీయ పరిస్థితులలో దేశానికి ఎర్రజెండా ఆవశ్యకతను తెలుసుకునే విధంగా ప్రజలు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివి శ్రీనివాసరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చోడవరం : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా, మేడే దినాన్ని పురస్కరించుకొని సిపిఎం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద బుధవారం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

తగరపువలస : ప్రముఖ కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు రవ్వ నరసింగరావు , ఎస్ శ్రీనివాసవర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెయిన్ రోడ్డులో వ్యక్తి దారుణ హత్య

- నిందితుడిని అప్పగించాలని పోలీసు స్టేషన్ వద్ద బాధితుని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. జనసంచారం ఎక్కువగా ఉండే మెయిన్ రోడ్డులోనే హత్య జరగడం సంచలనం కలిగించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన తాటికొండ అచ్చం నాయుడు (39) బుధవారం ఉదయం తన ఇంటి వద్ద నుండి పొలానికి వెళుతుండగా, అదే గ్రామానికి చెందిన గన్రెడ్డి శ్రీను వెనుక నుండి వచ్చి కత్తితో అచ్చంనాయుడును నరికేశాడు. దీంతో అచ్చం నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యకు పాల్పడిన నిందితుడు పోలీసులకు స్వచ్ఛందంగా లొంగిపోయాడు. మంగళవారం రాత్రి గన్రెడ్డి శ్రీనుకు, అచ్చన్నాయుడుకు మధ్య గొడవ చోటుచేసుకుంది. బుధవారం ఉదయం కూడా మరోసారి గొడవ జరిగింది. అనంతరం అచ్చం నాయుడు ఉదయమే ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరి కొద్ది దూరం రాగా శతకం పట్టు వద్ద అప్పటికే వేచి ఉన్న గన్రెడ్డి శ్రీను అచ్చన్నాయుడుడిని కత్తితో నరికివేసినట్లు స్థానికులు తెలిపారు.

అచ్చంనాయుడు హత్యకు గురి కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడును తమకు అప్పగించాలని గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. రెండు గంటల పాటు స్టేషన్ వద్ద ఆందోళన కొనసాగింది. పోలీసులు అచ్చంనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించడానికి సిద్ధం కాగా గ్రామస్తులు, కుటుంబీకులు ఒప్పుకోలేదు. దీంతో కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పి గ్రామస్తులను అక్కడ నుంచి పంపించేశారు. మృతుడి కుమారుడు పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలమిత్రల హర్షం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్ : పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న రాష్ట్ర గోపాలమిత్రలను గుర్తిస్తూ తెలుగుదేశం పార్టీ కూటమి మేనిఫెస్టోలో చేర్చడంపై గోపాల మిత్రలు హర్షం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం అయ్యన్న తనయుడు, మున్సిపల్ కౌన్సిలర్ రాజేష్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర గోపాలమిత్ర యూనియన్ నాయకులు కిల్లాడ వెంకటరమణ మీడియాతో మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న గోపాల మిత్రులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పాడి రైతులకు అండగా ఉంటూ పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చిందని, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాడి పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. వైయస్.రాజశేఖర్ రెడ్డి , కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన సమయంలో గోపాల మిత్రులకు గౌరవ వేతనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అనేకమంది ఎమ్మెల్యేలను మంత్రులను ఎన్నోసార్లు కలిసినప్పటికీ ప్రయోజనం లేదని దీంతో ఇటీవల నారా లోకేష్‌ను కలిసినప్పుడు గోపాల మిత్రులకు న్యాయం చేస్తానని మాట ఇచ్చారని, ఈ మేరకు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వెంకట సూర్యనారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -మునగపాక : డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యల్లపు వెంకట సూర్యనారాయణ సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. మండలంలో నాగులాపల్లి గ్రామంలో సూర్యనారాయణ 22వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా పాల కేంద్రంవద్ద సూర్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్‌గా, డీసీఎంఎస్ చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, పాల సంఘం అధ్యక్షునిగా ఇలా పలు పదవులు చేపట్టిన సూర్యనారాయణ ప్రజలకు ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. పాల కేంద్రం వద్ద సూర్యనారాయణ పేరుపై మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. నాగులాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైరన్ మళ్ల ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ గోసాల గోవింద, భీశెట్టి వెంకట సత్యనారాయణ, దొడ్డి శివ, పొలమరశెట్టి నాగు, మొల్లేటి ఆదినారాయణ, భీశెట్టి రామకృష్ణ, పొలమరశెట్టి నూకాలయ్య, పెతకంశెట్టి రాజునాయుడు, కాంద్రేగుల చందు, పాల్గొన్నారు.